

పత్తి కొనుగోళ్లు బంద్

● రేపు, ఎల్లుండి యథావిధిగా సేకరణ

వికారాబాద్, జనవరి 10: అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 11వతేదీ, గురువారం జిల్లాలోని పత్తి కొనుగోలు కేంద్రాల్లో పత్తి సేకరణ నిలిపివేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి తెలిపారు. 12, 13వ తేదీల్లో సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలోని పత్తి మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని ఆయన వివరించారు. రైతులు సహకరించాలని కోరారు.

ఏరివేత!

బినామీ రేషన్ డీలర్ల తొలగింపు పై నజర్



● ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన షురూ
● రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు



మేడ్చల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అస్తవ్యస్తంగా మారిన ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రేషన్ దుకాణాలు, డీలర్లు, సంబంధితశాఖ అధికారులపై నిత్యం ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. డీలర్లలో పెద్ద సంఖ్యలో బినామీలున్నట్లు ఆరోపణలు వస్తుండటంతో చక్కదిద్దే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. జనవరి31లోగా బినామీ డీలర్లను గుర్తించి ఏరివేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా రూరల్ పరిధిలో 169, జీహెచ్ఎంసీ పరిధిలో 450, మొత్తం 619 రేషన్ దుకాణాలున్నాయి. 5,06,364 ఆహారభద్రత కార్డులు, 17,690 అంత్యోదయ కార్డులు, 99 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ఇందులో దాదాపు పదుల సంఖ్యలో బినామీ డీలర్లు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థను చక్కదిద్దాలంటే మొదటగా బినామీ డీలర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా చర్యలు చేపట్టేందుకు ఇటీవల రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ నెల 20లోగా రేషన్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారు. బినామీలు నిర్వహిస్తున్నట్లు తేలితే సదరు డీలర్‌షిప్‌ను రద్దు చేయనున్నారు. తనిఖీల తీరు, గుర్తించిన బినామీలు, వారిపై తీసుకున్న చర్యలతో ఈనెల 31లోగా నివేదికలు ఇవ్వాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నామని, బినామీ డీలర్లు ఉంటే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి విజయలక్ష్మి తెలిపారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

▸ హాజరు కానున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు



వికారాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జడ్పీ సర్వసభ్య సమావేశం గురువారం మద్గుల్ చిట్టంపల్లిలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో జానకిరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యే ఈ సమావేశానికి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఆయనతో పాటు పరిగి, తాండూరు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన టి.రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి శాసనసభ్యుల హోదాలో తొలిసారిగా జడ్పీ సమావేశానికి హాజరవుతున్నారు. తొలిసారిగా జడ్పీ సమావేశానికి హాజరవుతున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలను జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో సన్మానించనున్నారు.

కొన్ని అంశాలపైనే చర్చ

జడ్పీ సర్వసభ్య సమావేశం ఎజెండాలో పొందుపరిచే 40 అంశాలపై చర్చ కొనసాగడం లేదు. కొన్ని అంశాలపైనే చర్చ కొనసాగించి మిగతా అంశాలను మమ అనిపించేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. 10, 15 అంశాలపై చర్చ కొనసాగించి ఆ తరువాత ముగించి వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎజెండాలో పొందుపరిచిన అన్ని అంశాలపైన చర్చ కొనసాగుతుందా, లేక ఎప్పటి మాదిరిగానే కొన్నింటిపై చర్చ కొనసాగించి మమ అనిపిం చేస్తారా అనేది వేచిచూడాలి.

28,50,767
మేడ్చల్ జిల్లా ఓటర్లు

▸ ఓటరు ముసాయిదా విడుదల
▸ 31,700 పెరిగిన ఓటర్లు

మేడ్చల్ జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అధికారులు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ఓటరు జాబితాను వెల్లడించారు. మార్పులు, చేర్పులతో పాటు ఈఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదు చేసుకునేలా చోటు కల్పించారు. జిల్లాలో మొత్తంగా ప్రస్తుతం 28,50,767 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 31,700 మంది ఓటర్లు పెరిగారు. ఈనెల 20, 21తేదీల్లో మరోసారి ప్రత్యేక ఓటు నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 22వరకు దరఖాస్తులతో పాటు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించనున్నారు. ఫిబ్రవరి 2న దరఖాస్తుల పరిశీలన అనంతరం ఫిబ్రవరి 8న తుది జాబితాను విడుదల చేయనున్నారు. ఈజాబితా ప్రకారమే లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ముసాయిదా ప్రకారం 2,439 పోలింగ్ కేంద్రాల్లో 28,50,767 మంది ఓటర్లున్నారు. ఇందులో 14,74,798 మంది పురుషులు, 13,75,591 మంది మహిళలు, ఇతరులు 378 మంది ఉన్నారు. గత సంవత్సరం నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో జిల్లా ఓటర్లు 28,19,067 మంది ఉండగా పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈనెల 6న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం తొలగింపులు, మార్పులు, చేర్పుల అనంతరం 31,700 మంది ఓటర్లు పెరిగారు.

సీఎంఆర్ పూర్తి చేయకపోతే కేసులు

▸ నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి చేర్చాలి
▸ వికారాబాద్, మేడ్చల్ జిల్లాల అదనపుకలెక్టర్లు లింగ్యానాయక్, విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లాలోని రైస్ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని రైస్ మిల్లులను పౌరసరఫరాలతో అధికారులతో కలిసి ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గోదాంలలో నిల్వ, సీఎంఆర్ పెట్టిన వివరాలు, బకాయి ఎంత ఉందో రికార్డులు, రైస్ నాణ్యత పరిశీలించారు. ఈ నెలాఖరులోగా బకాయిలు ఉన్న సీఎంఆర్ పూర్తి చేయాలని, రోజువారి లక్ష్యాన్ని పూర్తి చేయడంపై దృష్టి సారించాలని మిల్లర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజరు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

31లోగా సీఎంఆర్‌ను ఎస్‌సీఐకి చేర్చాలి

వికారాబాద్/యాలాల : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ఈనెల 31వ తేదీలోగా రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి సరఫరా చేయాల్సిందేనని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ స్పష్టం చేశారు. బుధవారం యాలాల్ మండలంలోని బాలాజీ, వెంకట పద్మావతి రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు రోజు వారీ లక్ష్యానికి అనుగుణంగా రైస్ మిల్లుల యజమానులు సీఎంఆర్ సరఫరా చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా రైస్‌మిల్లర్లు సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి చేరవేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం నిల్వలు, గన్నీబస్తాల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా పాల్గొన్నారు.



యాలాల్‌లోని బాలాజీ రైస్‌మిల్‌ను తనిఖీ చేస్తున్న లింగ్యానాయక్

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

టెన్త్ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 10 : పదో తరగతి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై ఎంఈవోలు, హెచ్ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాలని, ప్రణాళికాబద్ధంగా విద్యా బోధన చేస్తూ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో పది పరీక్షలు కట్టుదిట్టంగా, పకడ్బందీగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డీఈవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, డీసీఈబీ చైర్మన్‌అనంత్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రాంరెడ్డి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచుల జీవనోపాధికి ప్రణాళికలు రూపొందించాలి

చెంచుల జీవనోపాధికి మెరుగైన వసతులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా చెంచు కుటుంబాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 11 పనుల అమలుతీరుపై బుధవారం ఆయన సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గుర్తించిన చెంచులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈనెల 15న భారత ప్రధానమంత్రి చెంచుల అభివృద్ధికి ఎంపికైన జిల్లాల అధికారులతో మాట్లాడనున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు కోటాజీ, గోపాల్, జ్ఞానేశ్వర్, పాల్వన్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య



ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

పరిగిలో వంట గ్యాస్ కష్టాలు

● రీఫిల్ కోసం వినియోగదారుల పడిగాపులు



పరిగిలో వంటగ్యాస్ సిలిండర్ల కోసం వేచి ఉన్న వినియోగదారులు

పరిగి, జనవరి 10: పరిగిలో మళ్లీ వంటగ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. కొన్నేళ్ల పాటు ఇబ్బందులు రీఫిల్ సిలిండర్లను సరఫరా చేశారు. ఇటీవల వంటగ్యాస్ కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రీఫిల్ సిలిండర్ కోసం పడిగాపులు కాస్తున్నారు. పరిగిలో గోదాం లేదు, గ్యాస్ ఆటో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. గోదాం నుంచి తెచ్చుకుందామంటే 12కిలోమీటర్ల దూరం అని, ఆటోల ద్వారా సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుడి ఇంటికి వద్దకు తెస్తే రూ.30, పై అంతస్తులకు తీసుకెళ్తే రూ.50 ఎక్కువ తీసుకుంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా సిలిండర్ ఇవ్వడం లేదు. నిజానికి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లో రీఫిల్ సిలిండర్ వినియోగదారుల ఇంటికి ఉచితం సరఫరా చేయాల్సి ఉంటుంది. 8కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటేనే నామమాత్రంగా డెలివరీ చార్జి తీసుకోవాలి. కానీ ఇక్కడ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, డెలివరీ బాయ్స్ ఎవరూ రూల్ పాటించడం లేదు. వినియోగదారుల నుంచి ఇష్టానుసారం డబ్బు వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. పౌర సరఫరాల అధికారులు స్పందించి గ్యాస్ సరపరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పరిగి పట్టణ, గ్రామీణ వినియోగదారులు కోరుతున్నారు.

ప్రాణం తీసిన చికెన్ ముక్క!

- భోజనం చేస్తుండగా గొంతులో ఇరుక్కున్న ముక్క
- ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి



జితేందర్‌కుమార్ వర్మ(ఫైల్)

షాద్‌నగర్, జనవరి 10: భోజనం తింటుండగా గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జితేందర్ కుమార్‌వర్మ(46).. ఎలికట్టలోని తన స్నేహితుడు ధర్మేందర్ తివారితో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనంసాగిస్తున్నాడు. మంగళవారం పని పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్లి చికెన్ వండుకొని స్నేహితుడితో కలిసి భోజనం చేస్తూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. ధర్మేందర్ స్థానికుల సహాయంతో జితేందర్‌ను షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికెన్ ముక్క గొంతులో ఇరుక్కుపోవడంలో వల్లనే జితేందర్ మరణించడని పోస్టుమార్టం నివేదికలో తేలింది.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



తాండూరు రూరల్, జనవరి 10 : కరన్‌కోట్ ప్రభుత్వ పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్-2024 క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు డి.రవికుమార్, సుశీల, అనిల్‌కుమార్, బాలకృష్ణ, విజయకుమార్, నరేందర్, రాజేశ్వర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్‌కుమార్, ప్రభు, బాలరాజ్, భానుప్రకాష్, మనోహర్, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకుడు



పూడూరు, జనవరి 10:వికారాబాద్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్ బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లేష్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమితులైనందున ఈటలను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ, నాయకులు రాఘవేందర్, జంగయ్య, సుభాన్, శ్రీశైలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

» ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వికారాబాద్, జనవరి 10 : కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీరాయుళ్ల గుట్టురట్టు చేశారు వికారాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. విక్రయించేందుకు సిద్ధం చేసిన 11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సంబంధిత ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ కోటిరెడ్డి వెల్లడించారు. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి ప్రశాంత్‌వర్ధన్, వికారాబాద్ సీఐ శ్రీనివాస్ తమ బృందాలతో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డైమండ్ హోటల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ మార్గంలో వెళుతున్న ట్రాలీ ఆటో (టీఎస్06 యూబీ 6749)లో ఓ వ్యక్తి హైఫైవ్, టేస్టీ కింగ్ టైగర్ పేరుతో ఉన్న అల్లం, వెల్లుల్లి పేస్ట్ డబ్బాలను గుర్తించారు. విచారించగా నిందితుడు రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లికి చెందిన మన్షక్ అని, అతను హైదరాబాద్ అత్తాపూర్‌లో హ్యాపీ హోమ్స్ టవర్స్‌లో నివాసం ఉండే అజిత్‌చరణ్యా నుంచి కల్తీ అల్లం, వెల్లుల్లి కొనుగోలు చేసి విక్రయిస్తుంటానని చెప్పాడు. ఐదు కిలోల పేస్ట్ డబ్బాను రూ.200లకే విక్రయిస్తున్నట్లు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు...అజిత్ చరణ్యాను వికారాబాద్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి ఆరా తీశారు. అల్లం వెల్లుల్లిని ఉపయోగించకుండా కేవలం వెల్లుల్లి పొట్టు, యాసిడ్స్, కెమికల్స్ (ఆజన్‌టాక్స్ టైటానియం డై ఆక్సైడ్, గ్జాంథన్ గమ్ వినియోగించి అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు.



అల్లం, వెల్లుల్లి డబ్బాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

దీంతో పోలీసులు అత్తాపూర్‌లోని అజిత్ చరణ్యా నివాసానికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా, 30 కల్తీ అల్లం, వెల్లుల్లి కాటన్లు, 30 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉన్న 4 చిన్న డ్రమ్ములు, కెమికల్స్ యాసిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, కెమికల్స్ యాసిడ్స్‌తో పాటు రవాణాకు వినియోగించిన ఆటోను సీజ్ చేశారు. నిందితులు మనుష్క్, అజిత్ చరణ్యాపై కేసులు నమోదు చేశారు.

తక్కువ ధరకు విక్రయిస్తే ఆలోచించండి : జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

మార్కెట్లో తక్కువ ధరకు లభ్యమైతే ఆలోచించి కొనుగోలు చేయాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ప్రజలకు సూచించారు. తాము కొనుగోలు చేసేది అసలైనదా.. నకిలీదా అనేది గుర్తించాలన్నారు. జిల్లాలో కల్తీ, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదని, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అక్రమార్కులపై జిల్లా పోలీసులు నిఘా పెట్టారన్నారు. అక్రమ, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే వెంటనే జిల్లా పోలీసులకు లేదా డయల్ 100, లేదా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ 8712583483కి కాల్ చేసి తెలియజేయాలని ఎస్పీ కోరారు.

వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించిన మహారాష్ట్ర రైతులు

తాండూరు, జనవరి 10: తాండూరులోని వ్యవసాయ పరిశోధన స్థానాన్ని బుధవారం మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లా రైతు ఉత్పత్తి సంఘాలకు చెందిన 30మంది ప్రతినిధులు సందర్శించారు. కంది, కుసుమ, జొన్న పంటల పరిశోధన ఫలితాల గురించి తెలుసుకున్నారు. పరిశోధన స్థానం హెడ్ సుధారాణి శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడులు పొందొచ్చని రైతులకు వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. పంటను నేరుగా మార్కెట్‌లో అమ్మేకంటే వాటిని ప్రాసెసింగ్ చేసి అమ్మితే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్ పత్తిసాగులో పాటించాల్సిన మెలకువలు, చీడపీడల నివారణపై వారికి వివరించారు.

డ్రగ్స్, గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలి

» పాఠశాలల పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి

» బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 10 : రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన డ్రగ్స్, గంజాయి మాఫియాను వెంటనే అరికట్టాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.రఘునందన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తూరు మండలంలో గంజాయి చాక్లెట్లను విద్యార్థులకు అలవాటు చేయాలని చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డగ్స్ మాఫియా చివరకు చిన్నారులను కూడా వదలడం లేదన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను టార్గెట్ చేసుకుని రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. దశాబ్ద కాలం నుంచి ఇది తీవ్రరూపం దాలుస్తోందని, నార్కోటిక్స్, డ్రగ్ కంట్రోల్, పోలీస్ నిఘా విభాగం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్‌లు తీవ్రం చేయాలని, డ్రగ్స్ మాఫియా కబంధహస్తాల నుంచి రేపటితరం విద్యార్థులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు వచ్చే పేద మధ్యతరగతి కి చెందిన విద్యార్థులకు అనేక రకాలుగా ప్రలోభాలకు గురుచేసి ఈ మత్తుమందుల దందాలోకి లాగుతున్నారని తెలిపారు. గతంలో సింగరేణి కాలనీలో జరిగిన ఘటన పూర్తిగా గంజాయికి అలవాటుపడి బానిసైన నాగరాజు అనే యువకుడు అత్యాచారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువగా పేదలు నివసించే బస్తీలలో, వాటి చుట్టుపక్కల ఉండే పాఠశాలల సమీపంలోని పాన్‌షాపులు అడ్డాగా ఈ దందా నడుస్తోందని తెలిపారు.

తాండూరులో అస్తవ్యస్తంగా మురుగు నీటి పారుదల

» ఎన్జీటీని ఆశ్రయించిన సామాజికవేత్త

» ఆరుగురు అధికారులకు సమన్లు

తాండూరు, జనవరి 10: తాండూరు పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థ దారుణంగా ఉందని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తాండూరుకు చెందిన సామాజికవేత్త రాజ్‌గోపాల్ సారాడ కొన్ని రోజుల క్రితం చెన్నైలో గల జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆరుగురు అధికారులను బాధ్యులను చేస్తూ ఆయన పిల్ వేయగా.. ట్రిబ్యునల్ కోర్టు వారికి నోటీసులు జారీ చేసింది. స్వచ్ఛమైన నీరు ప్రవహించే చిలుకవాగు, కాగ్నా నది చెరువు, గొల్ల చెరువులకు మురుగు నీటిని మళ్లించి కలుషితం చేశారని పిల్‌లో ఆయన పేర్కొన్నారు. మురుగు కాల్వలను క్రమబద్ధీకరించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రాజ్‌గోపాల్ కలెక్టర్, ఆర్డీవో, తాండూరు మున్సిపల్ కమిషనర్, నీటి పారుదల శాఖ, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లపై ఆయన కేసు వేశారు. గొల్లచెరువు మొత్తం గుర్రపు డెక్కతో నిండినా దానికి తొలగించడం లేదని, మురుగు నీటి ప్రవాహాన్ని మళ్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.50కోట్లు కేటాయించి తాండూరులో మురుగు నీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించాలని రాజ్‌గోపాల్ డిమాండ్ చేశారు.



తాండూరులో ప్రవహిస్తున్న మురుగు నీరు



తుంకిమెట్లలో హైవేపై ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

కేంద్ర చట్టాన్ని వ్యతిరేకిస్తూ లారీ డ్రైవర్ల ఆందోళన

బొంరాస్‌పేట్/కీసర/శామీర్‌పేట, జనవరి 10: రోడ్డు ప్రమాదాల బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లారీ డ్రైవర్లు బుధవారం తుంకిమెట్లలో హైదరాబాద్-బీజాపూర్ 163వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. డ్రైవర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టాలతో తమ హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. లారీల యాజమాన్యాలకు సంబంధం లేకుండా రోడ్డు ప్రమాదం జరిగితే డ్రైవర్లదే బాధ్యత అని కొత్త చట్టంలో ఉందని, దీనికి రూ.7లక్షల జరిమానా, 10 ఏళ్ల జైలు చట్టంలో నిబంధన విధించారన్నారు. ఈ చట్టం అమలైతే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని రద్దు చేయాలన్నారు. వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద లారీ డ్రైవర్లు ధర్నా చేశారు. తమపై కేంద్ర ప్రభుత్వం కక్షగట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాతో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి లారీ డ్రైవర్లకు నచజెప్పి ధర్నాను విరమింపచేశారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేసి డ్రైవర్లను ఆదుకోవాలని శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ చౌరస్తా వద్ద వాహనాల డ్రైవర్లు ఆందోళన చేశారు. కార్యక్రమంలో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు శ్రీపతి నగేష్, శ్రీపతి ఉప్పలయ్య, నరసింహ, రవి, సత్యనారాయణ, డ్రైవర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ముందుకుసాగితేనే మంచి ఫలితాలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 10: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ముందుకు సాగితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలంగాణ గురుకులాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ అన్నారు. అంకుషాపూర్‌లో రెండు రోజుల నుంచి జరిగిన యూత్ పార్లమెంట్ మోడల్ యునైటెడ్ నేషన్స్ సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదివి ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ప్రతీ విషయంలోనూ క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకుసాగితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. సందర్భంగా వ్యాసరచన, క్విజ్, నృత్య, సైన్స్‌ఫెయిర్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ అదనపు కార్యదర్శి హనుమంత్‌నాయక్, సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, రీజినల్ కో-ఆర్డినేటర్లు రజని, నాగలక్ష్మి, శారద, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

పరిగి, జనవరి 10: పరిగి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. రంగాపూర్‌లో 400 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, అప్పా నుంచి మన్నెగూడ, మన్నెగూడ నుంచి బీజాపూర్ జాతీయ రహదారి తెలంగాణ 127కిలో మీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు వేయాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు. పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, వెనుకబడిన ప్రాంతమైన పరిగిలో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం, మంత్రులు తమ వినతులపై సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



చిన్నారికి సీపీఆర్ చేసి కాపాడిన 108 సిబ్బంది

శిశువుకు సీపీఆర్ చేసిన 108 సిబ్బంది

కీసర, జనవరి10: 108 సిబ్బంది సీపీఆర్ చేసి శిశువు ప్రాణాలు కాపాడిన ఘటన కీసరలో బుధవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడకు చెందిన దుర్గకు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కీసర ఆరోగ్య కేంద్రానికి తెచ్చారు. వైద్యులు దుర్గకు సాదారణ ప్రసవం చేశారు. ప్రసవానంతరం శిశువు కదలికలు లేకపోవడంతో వెంటనే 108సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108 సిబ్బంది ఈఎన్‌టీ రవి వైద్యనిపుణుల సహాయంతో బిడ్డకు సీపీఆర్(కార్డియో పల్మనరీ రెస్పిరేషన్) చేశారు. శిశువుకు 40 నిమిషాల పాటు సీపీఆర్ చేసి కదలికలు వచ్చేలా సిబ్బంది శ్రమించారు. దీంతో చివరకు శిశువు ఊపిరి పీల్చుకుంది. దుర్గ కుటుంబీకులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



సీలింగ్ భూమిలో నిర్మాణాల కూల్చివేత

కీసర, జనవరి 10: సీలింగ్ భూమిలోని అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. చీర్యాల్‌లోని సర్వే నంబర్ 58, 59లలో ఉన్న సీలింగ్ భూమిలో కొందరు రియల్టర్లు 80గజాల చొప్పున ప్లాట్లు చేసి గదులను నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్ బుధవారం జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఎవరైనా సీలింగ్, అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

యాసంగి పంటలను ఆన్‌లైన్ చేసుకోవాలి

ధారూరు, జనవరి 10: యాసంగిలో సాగుచేసిన పంటలను రైతులు అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. రుద్రారంలో బుధవారం యాసంగి పంటలను అన్‌లైన్ చేసుకున్న రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలు సాగుచేసుకునే రైతులు అధికారులతో పంటల వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ పంటను పరిశీలించిన ఆయన.. పంటకు వేరుకుళ్లు తెగులు ఆశించిందని గుర్తించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు త్రైలోక్య, సంజూరాథోడ్, రైతులు పాల్గొన్నారు.

27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు అనురాగ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 10: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనీష్‌చంద్ర, సౌమ్య మహారాష్ట్రలోని నాసిక్ నగరంలో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. బుధవారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ విజయ్ కుమార్‌లు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జిల్లా సైన్స్‌ఫేర్

» జిల్లా స్థాయిలో 312 పాఠశాలల విద్యార్థుల ప్రదర్శన

» ఆద్యాంతం ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ

» అలంరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

» ప్రత్యేక ఆకర్షణగా బాలికల బంజారా నృత్యం

» విద్యార్థుల సృజనాత్మకతశక్తికి ప్రతిరూపమే విద్యాప్రదర్శనలు

» జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు

ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల జనవరి 10: విద్యార్థుల సృజనాత్మకత, మేధాశక్తికి ప్రతిరూపంగా విద్యా ప్రదర్శనలు నిలుస్తున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు అన్నారు. గురుకుల విద్యాపీఠ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న 51వ జిల్లా స్థాయి సైన్స్, మ్యాథమాటిక్స్, పర్యావరణ ప్రదర్శన బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ సుశీందర్ రావు పాల్గొని మాట్లాడుతూ ఆలోచనలు భిన్నంగా ఉంటే ఆ విష్కరణలు సైతం భిన్నంగా ఉంటాయని అన్నారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచుతాయని అన్నారు. మనం అనుభవిస్తున్న విజ్ఞాన ఫలాలు ఎంతో మంది శాస్త్రవేత్తల కృషి శ్రమ ఫలితమని ప్లానటరీ సొసైటీ డైరక్టర్ ప్రొఫెసర్ నేథనియల్ అన్నారు. ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన ప్రాజెక్టులకు డీఈఓ చేతుల మీదుగా బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు, కోఆర్డినేటర్ రాజిరెడ్డి, డిసిఈబి సెక్రటరీ రాంచంద్రా రెడ్డి ,మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు డీ.శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ ఉపాధ్యా సంఘం జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు

కడ్తాల్ ప్రగతి స్కూల్లో ఘనంగా సైన్స్‌ఫెయిర్

కడ్తాల్, జనవరి 10 : మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక వస్తు ప్రదర్శన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే మేళాను పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర ప్రతినిధులు అల్లాజీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తల్లోజు వెంకటయ్య, నల్లబోలు సుధీర్‌రెడ్డిలతో కలిసి పాఠశాల కరస్పాండెంట్ కె.సువర్ణగోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు బీను, అధ్యాపకుల బృందం పర్యవేక్షణలో విద్యార్థినీవిద్యార్థులు 162 అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఎంఈవో సర్దార్ నాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, అరుణ, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ సందడి నరేందర్ రెడ్డిలు సందర్శించారు.



కడ్తాల: మేళాను ప్రారంభిస్తున్న సువర్ణగోవర్ధన్ రెడ్డి

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

కొడంగల్, జనవరి 10: కురుమ యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని వికారాబాద్ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్యయాదవ్ అన్నారు. బుధవారం పరిగిలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హస్నాబాద్ గ్రామానికి చెందిన ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రాముయాదవ్, నరేంద్రయాదవ్, విశ్వనాథ్‌యాదవ్, కృష్ణయాదవ్, రాజుయాదవ్, నర్సిములు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆంజనేయులుకు నియామక పత్రం అందిస్తున్న యాదయ్య

ఆదర్శప్రాయుడు లూయిస్ బ్రెయిలీ



బ్రెయిలీ జయంతి వేడుకలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జనవరి 10: కంటి చూపు లేకపోయినా చదువుకొని ప్రయోజకులం కాగలం అని ప్రపంచానికి చాటిన మహనీయుడు డాక్టర్ లూయిస్ బ్రెయిలీ అని, ఆయన అందరికీ ఆదర్శం అని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని పురస్కరించుకొని బుధవారం విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. బ్రెయిలీ చూపు లేదని కుమిలిపోలేదని, తానేంటో ప్రపంచానికి తెలిసేలా చేసుకున్నారన్నారు. దివ్యాంగులు తమలోని అవయవ, మానసిక లోపాలను గుర్తు చేసుకుంటూ తమలో తాము కుమిలిపోకుండా.. తామెవరికీ తీసిపోమంటూ చాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగితే విజయం మీ వశమవుతుందని చైర్‌పర్సన్ అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్, లూయిస్ బ్రెయిలీ కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వీసీపీఏ అధ్యక్షుడు నరసింహులు, డీడబ్ల్యూవో ఎఫ్ఆర్‌వో వెంకట్, దీపు, అంజమ్మ, పద్మ, కవిత, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌కు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న హరిప్రసాద్, పాల్గొన్న కాలనీ వాసులు

ఘట్‌కేసర్, జనవరి 10: సంస్కృతి టౌన్‌షిప్ వాసులకు సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తానని కౌన్సిలర్, టౌన్‌షిప్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాద్ అన్నారు. బుధవారం టౌన్‌షిప్‌లో సికింద్రాబాద్-టౌన్‌షిప్‌కు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఆయన ప్రారంభించారు. గతంలో ఉన్న ఈ సర్వీసును కరోనా సమయంలో నిలిపేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించారు. నిత్యం 10 ట్రిప్పులు నడపుతామని వివరించారు. కార్యక్రమంలో మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ మలిపెద్దికి సత్కారం



ఘట్‌కేసర్, జనవరి 10: ఇటీవల ఘట్‌కేసర్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డిని బుధవారం ఆంధ్రజ్యోతి పాత్రికేయులు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ముగ్గుల పోటీ కార్యక్రమం ముగియగానే అత్యవసర పనిపై వెళ్లిన ఆయనను ఘట్‌కేసర్‌లో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు సీహెచ్.రాజిరెడ్డి, కె.నర్సింహ, నాయకులు కొంతం అంజిరెడ్డి, కందుల కుమార్, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండగల సాయన్న సేవలు శ్లాఘనీయం



సాయన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

కులకచర్ల, జనవరి 10: పేద ప్రజలకు పండగల సాయన్న సేవలు అందించిన సేవలు శ్లాఘనీయం అని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇప్పాయిపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పండగల సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పేదల అభ్యున్నతికి పండగల సాయన్న కృషి చేశారని కొనియాడారు. ఆ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఎంపీపీ సత్యహరిచంద్ర, సర్పంచ్ అనురాధబాల్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మగౌడ్, మహాసభ రాష్ట్ర నాయకులు బాలముకుందం, భీంరెడ్డి, భరత్, ఆంజనేయులు, గోపాల్ పాల్గొన్నారు.

దళితబంధుకు ఎంపికైన వారికి న్యాయం చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

కొడంగల్, జనవరి 10: దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని వికారాబాద్ జిల్లా దళితబంధు సాధన సమితి, దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎరన్‌పల్లి శ్రీనివాస్, సలహాదారులు రామన్న, పెంటయ్య, వెంకటయ్య, నర్సిములు, కో-కన్వీనర్లు దత్తు, శ్రీనివాస్, బిచ్చయ్య, వెంకటయ్య, అశోక్‌లు మాట్లాడుతూ.. దళితులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయాలని ప్రయత్నిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, మంచన్‌పల్లి సత్తయ్య, వెంకట్రాములు, కులకచర్ల ఆనంద్, పరిగి, కొడంగల్, తాండూర్, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

శామీర్‌పేట, జనవరి 10: మండల సభలో ప్రజా ప్రతినిధులు అడిగిన సమస్యల ప్రశ్నలపై అధికారులు బాధ్యతగా సమాధానం ఇవ్వాలని, సమస్యల పరిష్కారానికి చర్యలను తీసుకోవాలి, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి హెచ్చరించారు. బుధవారం శామీర్‌పేట మండల పరిషత్‌లో ఎంపీపీ ఎల్లుబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా వచ్చారు. శామీర్‌పేటలో సర్వే నంబర్లు 320, 321, 317, 319లలో పొలాల్లో సాగు నీటి కాల్వను కొందరు కబ్జా చేసి వెంచర్ చేస్తున్నారని 6నెలలుగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సాయిబాబ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసు సమాధానం ఇస్తూ.. హెచ్ఎండీఏ అనుమతులతోనే అక్కడ వెంచర్ చేస్తున్నారని చెప్పారు. దీంతో జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ.. ఆ వెంచర్‌లో సాగు నీటి నాలా ఉండగా ఇరిగేషన్ అధికారులు ఎన్వోసీ ఎలా ఇచ్చారని, ఇది అక్రమం అని, అధికారులు అవినీతికి పాల్పడ్డట్టు తేటతెల్లమవుతోందని మండిపడ్డారు. మీరు వెంచర్‌లోకి వెళ్లి విచారణ చేసి నీటి కాలువను వెంచర్లో కలిపేసిన యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయించాలని జెడ్పీ చైర్మన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని తాము తహసీల్దార్‌కు, ఆర్డీవోలకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వాపోయారు. దీనిపై సమాధానం చెప్పేందుకు అసిస్టెంటు వచ్చినట్లు తెలిసి తహసీల్దార్ సమావేశానికి ఎందుకు రాలేదని నిలదీశారు. ఆయన స్థానంలో కొత్త తహసీల్దార్ వస్తారని జెడ్పీ చైర్మన్ అన్నారు. బొమ్మరాసిపేట పంచాయతీ కారోబార్ మల్లేశ్ అక్రమాలకు పాల్పడుతున్నాడని ఎంపీటీసీ ఇందిర అన్నారు. అలాగే సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు రాలేదెందుకని ఎంపీడీవో వాణిని సభ్యులు నిలదీశారు. సభ్యుల ఫిర్యాదులపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ.. మండల సమావేశానికి మండల అధికారులంతా తప్పక హాజరుకావాలని, ఇక నుంచి గైర్హాజరైతే వేటు వేస్తానని హెచ్చరించారు. సభకు జడ్పీటీసీ అనితలాలయ్య, వైఎస్ ఎంపీపీ సుజాత, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏడీఈ రమణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కొందరు అధికారులు, పీఎస్‌లు హాజరయ్యారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 10: విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టిసారించి సత్ప్రవర్తనతో మెలగాలని కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదనరెడ్డి అన్నారు. బుధవారం జినుగుర్తిలో గల మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో క్రమశిక్షణ, భవిష్యత్తులో ఎలా మెలగాలి, విద్యను ఎలా అభ్యసించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. టెన్త్ పరీక్షల్లో బాగా చదివి ఎలా మార్కులు సాధించాలో వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే భవిష్యత్తులో రాణిస్తారన్నారు. ఇష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. తరగతి గదిలో బోధిస్తున్నప్పుడు ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా శ్రద్ధగా వినాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగయ్య, వార్డెన్ సమీర్, టీచర్లు అబ్దుల్లామీర్, సంజయ్‌గౌడ్, డి.శంకర్, అయిషావున్నీసా, అమర్, నర్సింహులు, మహేష్ పాల్గొన్నారు.

పోలీసులకు ఇరు వర్గాల ఫిర్యాదు

తాండూరు రూరల్, జనవరి 10: జినుగుర్తి గేటు సమీపంలోని సర్వే నంబర్-55లోని పట్టా భూమి నాదంటే నాదని గొడవపడి బుధవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఇక్కడ కొందరు 19.3ఎకరాల భూమిని కొన్నారు. జినుగుర్తికి చెందిన అజ్మత్ అలీ 20గుంటలు కొని హద్దులు పాతుకున్నాడు. ఇది తెలుసుకున్న సిరిగిరిపేట్‌కు చెందిన తుప్పుడు శేఖర్ ఇదే సర్వే నంబర్‌లో తాము భూమి కొన్నామని, ఈ పొలం మాదని అలీతో ఘర్షణ పడ్డారు. తాను అన్ని డాక్యుమెంట్లు చూసే భూమి కొన్నానని, హద్దులు పాతుకున్నానని అజ్మత్ అలీ అన్నాడు. ఇది తెలుసుకోకుండానే శేఖర్ తనపై దౌర్జన్యం చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శేఖర్ కూడా తన డాక్యుమెంట్లతో ఫిర్యాదు చేశాడు. విషయం తెలిసి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, శామప్ప, ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఆ పొలం వద్దకు చేరుకొని పరిశీలించారు. తమ గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబీకుల పేరున పట్టా ఉన్నట్లు తెలిపారు. ఈ భూమిలో హద్దులు చూసి అజ్మత్ అలీ కుటుంబీకుల పేరున 20గుంటలు కొన్నట్లు నాయకులు వెల్లడించారు.

ఈ నెల 27న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు



నాయకులను సన్మానిస్తున్న రాష్ట్ర నేతలు

కొడంగల్, జనవరి 10: ఈ నెల 27న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును మహబూబ్‌నగర్‌లోని అంబేడ్కర్ కళా భవన్‌లో నిర్వహిస్తామని రాష్ట్ర నాయకులు కొండ అశోక్, దక్షిణ తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య తెలిపారు. బుధవారం కొడంగల్ ఐబీలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. 27న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపయ్య ఆదేశాల మేరకు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర నాయకులు నియోజకవర్గ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజు, నూతనంగా ఎన్నిక అయిన కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నరేశ్, గణేశ్, రమేశ్, నర్సింహా, వెంకట్‌సాయి, చిన్న, కృష్ణ పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వికారాబాద్, జనవరి 10: వికారాబాద్ మునిసిపాలిటీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ మంజుల శంకుస్థాపన చేశారు. బుధవారం ఒకటి, 8వ వార్డుల్లో వాటర్ పైపులైన్, 7వ వార్డులో యూజీడీ, పనులకు కౌన్సిలర్లతో కలిసి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకునేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమాల్లో మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, గోపాల్, సంతోష నర్సిములు, నాయకులు వెంకటయ్యగౌడ్, దీపు, మునిసిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

'జెడ్పీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి'

వికారాబాద్, జనవరి 10: ఈ ఫిబ్రవరి నెలాఖరులోగా జెడ్పీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా వేగం పెంచాలని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అధికారులను ఆదేశించారు. వికారాబాద్‌లో రూ.10కోట్లతో నిర్మిస్తున్న జడ్పీ భవన నిర్మాణ పనులపై బుధవారం జెడ్పీ కార్యాలయంలో ఇంజినీర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. వచ్చేనెల కల్లా వందశాతం పనులు పూర్తికావాలని స్పష్టం చేశారు. అలాగే అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పాత ఎంపీడీవో కార్యాలయాల మరమ్మతులు పూర్తిచేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించకపోతే కాంట్రాక్టర్లపై, సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిణి, పీఆర్ ఈఈ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బాబు శ్రీనివాస్, డీఈఈలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగు నీరు

- పట్టించుకోని అధికారులు



జినుగుర్తిలో మిషన్ భగీరథ ట్యాంక్ నుంచి పోతున్న నీరు



తాండూరు రూరల్, జనవరి 10 : మండల పరిధి గ్రామాలకు సరఫరా చేసే మిషన్ భగీరథ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. జినుగుర్తి శివారులో సమీప గ్రామాలకు నీరు అందించేందుకు 150 లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌ను నిర్మించింది. దీని ద్వారా రోజూ 20గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. బుధవారం గ్రామాలకు సరఫరా కావాల్సిన నీరంతా ట్యాంకు కింది భాగం నుంచి పోవడంతో స్థానికులు మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జినుగుర్తి శివారులో వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆడ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ సబీహ సుల్తానా

వికారాబాద్, జనవరి 10 : ఆడ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బలరాం అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం కేజీబీవీలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బాలలు, మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ఆడ పిల్లలను విద్యా పరంగా అభివృద్ధి పరిచేలా కృషి చేస్తేనే వారు ముందుకు సాగుతారని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా బాలలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్‌చేయాలన్నారు.వైస్‌ప్రిన్సిపాల్ సబీహ సుల్తానా, వరలక్ష్మి, బాబు, రాందాస్, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఐటీఐలో లేటరల్ ఎంట్రీ విధానం, పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిటెక్నిక్ 2వ సంవత్సరం డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ అల్వాల్ ప్రిన్స్‌పాల్, జిల్లా కన్వీనర్ పి.శంకరయ్య బుధవారం పేర్కొన్నారు. పాలిటెక్నిక్ రెండో సంవత్సరం కోర్సులో చేరేందుకు రెండేళ్ల ఐటీఐ(ఎన్సీవీటీ) కోర్సు పూర్తిచేసి ఉండాలని, అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ(ఎన్‌సీవీటీ)కోర్సులో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారందరూ బ్రిడ్జి కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. విద్యార్థులు ఈ నెల 31కల్లా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదనపు వివరాలకు 8985415042 నంబరులో సంప్రదించాలని కోరారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ

శామీర్‌పేట, జనవరి 10 : క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడుతాయని ఎంపీపీ ఎల్లుబాయి అన్నారు. బుధవారం శామీర్‌పేటలోని మినీ స్టేడియంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ శాఖ ఏర్పాటు చేసిన క్రీడోత్సావాలను ముఖ్య అతిథి ఎంపీపీ ప్రారంభించారు. బాలబాలికల క్రీడాకారులను ఎంపీపీ పరిచయం చేసుకొని అభినందించారు. క్రమశిణతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని, భవిష్యత్తులో గొప్ప ఉద్యోగాలతో సమాజానికి సేవలందించాలని ఎంపీపీ కోరారు. కాగా క్రీడాపోటీల్లో ఘట్‌కేసర్ ఎస్సీ హాస్టల్ బాలురు కబడ్డీలో విజేతలుగా, యాప్రాల్ హాస్టల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. వాలీబాల్‌లో విజేతగా మేడ్చల్ ఎస్సీ హాస్టల్ బాలురు, రన్నర్స్‌గా యాప్రాల్ బాలురు నిలిచారు. ఖోఖోలో యాప్రాల్ బాలురు మొదటి స్థానంలో, మేడ్చల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. బాలికల్లో కబడ్డీలో దుండిగల్ హాస్టల్ బాలికలు విజేతలుగా, మేడ్చల్ బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్‌లో దుండిగల్ బాలికలు విజేతలుగా, మేడ్చల్ బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. ఖోఖోలో దుండిగల్ విద్యార్థినులు ప్రథమ స్థానంలో, మేడ్చల్ బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. లాంగ్‌జంప్, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలను కూడా నిర్వహించారు. విజేతలకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ బలరాం, సాంఘీక సహాయాధికారి శ్రీకర్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల పీడీలు మురళీకృష్ణ, సత్తిరెడ్డి, పీఈటీలు వెంకటనారాయణ, గోపాల్‌చారి, రాధిక, శ్వేత, ఎస్సీ హాస్టళ్ల సంక్షేమ అధికారులు, వార్డెన్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



కులకచర్ల, జనవరి 10: చౌడాపూర్ మండలం మరికల్ జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు బోధించారు. విద్యాశాఖ మంత్రిగా పల్లవి, కలెక్టర్‌గా రాంచరణ్‌చారి, డీఈవోగా అరవింద్, ఎంఈవోగా జశ్వంత్, హెచ్ఎంగా హరి వ్యవహరించారు. హెచ్ఎం సర్వసతి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబీకులకు పరామర్శ

కొడంగల్, జనవరి 10: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు శశివర్ధన్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. బుధవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వారి కుటుంబీకులను పరామర్శించారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకులు సలీం, చంద్రశేఖర్, వెంకటేశ్, నజీమొద్దీన్ ఉన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



షకీల్(ఫైల్)

పరిగి, జనవరి 10: అనారోగ్యంతో ఓ టీచర్ మృతిచెందారు. దోమ మండలం దాదాపూర్ గ్రామానికి షకీల్(42) పరిగి మండలం ఇబ్రహీంపూర్ దాడి తండాలో టీచర్‌గా పనిచేస్తున్నారు. షకీల్ పదిహేను రోజులుగా అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఉదయం ఆయన మృతి చెందాడు. షకీల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 10: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి అయినట్లు ఎంపీడీవో వై.అరుణారెడ్డి తెలిపారు. అంకుషాపూర్ ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 5 నుంచి చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. 11గ్రామాల్లో నుంచి 11,759 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశామని ఎంపీడీవో తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు చేయడంలో తప్పులు లేకుండా చేసినట్లు తెలిపారు. మండలంలో దరఖాస్తులు చేసుకోని వారు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో నందకిషోర్, అయా గ్రామాల కార్యదర్శులు ఆర్వీ.కవితాయాదవ్, శశికుమార్, సునీత, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, నరేష్, మల్లారెడ్డి, లింగారెడ్డి, రామ్మోహన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- **ధారూరు:** పీఆర్‌టీయూ (టీఎస్) 2024 క్యాలెండర్‌ను ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి బుధవారం ఆవిష్కరించారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో పీఆర్‌టీయు క్యాలెండర్లను పలువురికి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీడీవో చెన్నారెడ్డి, జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, సంఘం బాధ్యులు మల్లికార్జున్, శ్రీనివాస్, మాణిక్యం, గుణవంత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **దౌల్తాబాద్:** మండలానికి మంజూరైన బీసీ గురుకుల పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దౌల్తాబాద్‌లో స్థల సేకరణ కోసం తహసీల్దార్ సి.విజయ్‌కుమార్‌కు సర్పంచ్ శిరీష భర్త రమేశ్, సురేశ్ వినతిపత్రం అందించారు. గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం స్థల సేకరణ చేపట్టాలని కోరారు.
- **నవాబుపేట:** బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పడిపోవడంతో మార్కెట్ కమిటీ పదవీకి రాజీనామా చేస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ జి.ప్రశాంత్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నూతనంగా మార్కెట్ కమిటీకి మేకల సంత ఏర్పాటు, కార్యాలయం కోసం స్థల సేకరణ చేశామని తెలిపారు. చైర్మన్‌గా రైతులకు ఇబ్బందులు కలగకు ండా పనులు చేశామన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులను రైతులకు జమచేయలేదన్నారు.
- **కొడంగల్:** 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం గడువును ఈ నెల 20 వరకు పొడగించినట్లు బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాంతీయ సమన్వయ అధికారి యాదయ్యగౌడ్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులు అని తెలిపారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపాదికన విద్యార్థులకు ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 180042545678 అనే టోల్ ఫ్రీ నంబర్లో సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

కులకచర్ల, జనవరి 10: కులకచర్ల నుంచి అయ్యప్పస్వాములు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మాల ధరించిన స్వాములు 41రోజుల దీక్ష చేపట్టారు. బుధవారం హనుమాన్ ఆలయంలో ఇరుముడులతో పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా అయ్యప్పస్వామి ఆలయానికి వచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో శబరిమలకు బయల్దేరారు.

శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

కొడంగల్, జనవరి 10: మాస శివరాత్రిని పురస్కరించుకొని కొడంగల్‌లోని మహాదేవ శివాయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

కేఎల్లార్ వెంచర్‌లో రామభక్తుల శోభాయాత్ర

మేడ్చల్ టౌన్, జనవరి 10: మేడ్చల్‌లోని కేఎల్ఆర్ వెంచర్‌లో బుధవారం రామభక్తులు అయోధ్య రామ మందిర అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు ఇంటింటికి వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు. వారికి స్థానికులు హారతులు పట్టి స్వాగతం పలికారు. కౌన్సిలర్ హరికృష్ణ, కాలనీ వాసులు ధాత్రిక లింగం, నరేందర్, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కీసర రూరల్, జనవరి 10: అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం 19వ వార్డులో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

డీడీలు కట్టిన వారికి గొర్రెలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు యాదయ్య

పరిగి, జనవరి 10: గొర్రెల కోసం డీడీలు కట్టిన వారికి వెంటనే ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య కోరారు. బుధవారం పరిగిలోని యాదవ కుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పులు చేసి డీడీలు కట్టి 8నెలలు అవుతున్నా గొర్రెలను ఇవ్వకపోవడంతో కాపరులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం యాదవుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గొర్రెలను పంపిణీ చేయాలని, లేకుంటే డీడీల డబ్బు తిరిగి ఇవ్వాలని కోరారు. సమావేశంలో లీగల్ సెల్ అధ్యక్షుడు కె.నరేంద్రయాదవ్, రాష్ట్ర నాయకులు రాముయాదవ్, జిల్లా కార్యదర్శి అంజనేయులు, మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌యాదవ్, నాయకులు కృష్ణయాదవ్, రాజ్‌యాదవ్, నర్సింహులుయాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండాలకు రోడ్లు వేయాలి

మేడ్చల్ టౌన్, జనవరి 10: మండలంలోని దొంగలగుట్ట తండా, డుడెం గడ్డ తండాలకు రోడ్లు వేయాలని సీపీఎం నాయకులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. రావల్‌కోల్‌లోని జీవన్‌రెడ్డి తోట నుంచి తండాల వరకు వచ్చే రోడ్డు పూర్తిగా పాడై ప్రయాణించలేని స్థితికి చేరిందన్నారు. ఈ తండాల్లో 400మంది ఉంటున్నారని, రోడ్డు సరిగా లేక తండాలకు బస్సులు రావడం లేదని, అధికారులు రోడ్డు వేయించాలని కోరారు.